# సేనుగల్లోడు

మనిసికొాక మాటా గొడ్డుకొాక దెబ్బా అగ్ని. అన్ని .......... దెబ్బలు తిన్న బోడ్డి గాటికాడ మామూలుగానే బుసబుసలాడ్తా మేత తింటానే వుంది. వోబన్న మటుకు బువ్వ తినల్యాకపాయె ! అట్టని ఎర్రన్నా, సూరమ్మా కావాల్నని వోబన్నను తిట్టిందేమీ లేదు. వాళ్ళు మాటొార్సగా అన్నెట్టే వుండాది. పన్లో పోడం కాన్నుంచీ గాటికాడ మేత తినడం దాంకా ఒక్కొక్క ఎద్దు ఒక్కొక్క రకంగా వుంటాది. బోడ్డి గాట్లో మేతను బుసపెడ్తా కుమ్ముతా తింటే, దాన్జతది ముంగారు కొమ్ముల్లి రోన్ని పోసల్ను అందుకోని కండ్లు మూసుకొని నములుకుంటా కుద్దుగా[1] తింటాది. బోడ్డి సాతాగా కోపదార్ది, దాన్దాపట్టి నిమ్మలమయింది.

దాంట్లతో సేద్యం సేస్తా వుండేటోడికి యిరి తెల్చుతాయి. ఎద్దుతో కల్చి తనూ యింగో ఎద్దయి పన్జేసినోనికే, యెద్దెట్టాటిదో తెల్చేది. అట్టాటోనికి ఎద్దు సంగతి తెల్చినట్టే, ఎద్దుగ్గూడా అట్టాటోని సంగతి తెల్చిపోతాది. గోడసాట్నుంచీ రిక్క[2] గొట్నా తన సేద్యెకాడేనా, కాదా అనేది కనిపెట్తాది. నొాగల్లో కూచ్చొని వుండే మనిసి పగ్గం బట్టిన బిర్రును బట్టే అసలోడా, కొత్తోడా అని కనుక్కొంటాది. పెయిమీన అట్ట సెయ్యేస్తే అది తనకిట్టంగా వుండాదో కట్టంగా వుండాదో తోకాడిచ్చడంతోనే సెప్తాది ..!

పుట్టగోసి పెట్టిన కాన్నుంచీ ఎద్దుల మీదనే పన్జేస్తా వుండేదాన, ఏ ఎద్దెట్టాటిదో, దాని పని వాటమేందో, యాసేలో యా యారముట్టు యెంత తెగాల్నో వోబన్నకు బాగా తెల్చు. యీ పొద్దు ఎర్రన్న సేసినట్టు ఎన్నడూ లేన్ది ఎక్కిరిచ్చి నట్టుగా సేద్యాని కొస్తే .... యామయితాది ? యీ పొద్దు జరిగినట్టే జరుగుతాది. ఆ కట్టకాడి సేలో గొర్లు వుడిగిందాన తుమ్మ పీకెలు మొల్చి, గుంటికెను ముందుకు పోనీకుండా వుండాయి. వాట్ని కొట్టేందుకు కూలోన్జూడమంటే ... రొంద్రోజుల్నుంచీ వూకొట్తానే వుండె. యీ పొద్దు, పొద్దు రొండు బార్లెక్కినాంక సెట్టడ్డ[3] బుజానేసుకోని సీకిరెట్టు తాక్కుంటా, ఎర్రన్నే వొచ్చినా దబ్బా ... సేనికాడికి !

వొచ్చి, “నేను గుంటికె తోల్తాగానీ, నువు సెట్లు గొట్టుపో” అని సెట్టడ్డ సేతికిచ్చె. కూలోనికి మల్లా కూలియ్యడమెందుకు, సేద్యెం జేయడం సెట్లు గొట్టడం రొండూ వోబన్నతోనే సేయిచ్చుకోవచ్చులే ... అనుకున్నెట్టుండాది. అదెట్టన్నా ఆయెగానీ .... అసలుకు అయప్ప సేద్యెం నేర్సుకోకుండానే సాలిచ్చి నోడు ! ఏ బాండు కాయితంలో ఎంత అసలుండాదో, వడ్డీ ఎంతయిందో నిద్దట్లో లేపినా సెప్తాడు గానీ యాసేలో యారముట్టు యెంత తెగాల్నో, యాడ ఎద్దుకు అలకనగా వుంటాదో యాడ బలువయితాదో యియ్యేం తెలవు. ఆయప్ప గుంటికె దిండు మీదికెక్కి ‘పా’ అంటానే, ‘పో’ అని, బోడ్డి కాడిమానుకేసి కొమ్ము టకామని కొట్టె.

అయిదారు పగ్గాల దూరంలో సెట్లు గొడ్తా, బోడ్డని యెవారం సూస్తా వుండే వోబన్నకు నగొస్తా వుంది. కట్టబోసినకాడ మిట్టనుంచొచ్చే మన్ను అని, మెత్తంగా వుండి, యారముట్టు కనపన్నట్టు దిగిపోతాది. ఆడ గూడా అయప్ప గుంటికె దిక్కుండా తోల్నాడు! “యీడెవుర్రా, యెదాముడినాయాలు” అనుకుంటా వున్నెట్టు బోడ్డి బుసబుసలాడ్తా వుంది. ఆడ కాలానుకుంటా సేతి బరువున తోలమని సెప్తే .... “నాకు తెల్చులే, నువు సెట్లు గొట్టు” అనె. రొండు మలుపులయితానే గుంటికె నిలిపి, ఎద్దులు నెమరేయాలన్జెప్పి,

1) నెమ్మదిగా 2) ఎద్దులను హెచ్చరిస్తూ నోటితో చేసే ధ్వని 3) మొక్కలను కొట్టేసే పరికరం

తలకాయ కింద టువాల పెట్టుకోని, ఎలకల పండుకోని గురకలు పెట్టె.

"ఈ పొద్దుగానీ సేద్యెం అయిపాకపోతే, రేపు మల్లా యిదే సేనికి రావాల" అని సెప్తే, "నాకు తెల్చులే" అనె మల్లా. ఎఱ్ఱన్న ఆయిగా నిద్దరబాయె గానీ, ఎద్దులు మాత్రం ఆయప్ప సేద్యానికి పాపం యింగా నెమరేయల్యాకపాయె. యిట్టాటప్పుడు నిద్దర్లేసి మల్లా గుంటికెక్కబోతా, జంబంగా నీలుక్కోనిపోయి, బోడ్డాని ముకుతాడు ముడిని పైకి జరపబోయినాడు. 'దొరికినావ్రా....' అనుకునిందేమో అది ! అదేపట్న వూంచితగిలె[4], ఆయప్ప సేలో ఎల్లెలికిలా[5] పడిపాయె.

పన్నేడు లేసి అమొయిన వూడిపోయే పంచ సుట్టుకుంటా బోడ్డాని కొట్టబట్టె సూడూ .... సొలకాల తెగిపోతే ములుగట్టె, ములుగట్టె యిరిగిపోతే మేడ్తోక తీసుకోని కొట్టికొట్టి సేలో యీరంగం తొక్కె! యింగా వుడుకు తగ్గక, సేలో వుండల్యాక యింటి దావ పట్టె. ఆయప్ప యిటొచ్చి, అట్టబోతే వోబన్నే మిగిల్న సెట్లు కొట్టి, కొదవ పడకుండా సేద్యెం సేసి పొద్దు వాటారే తప్పటికి ఎద్దల్తో యింటికి జేరె.

అవతల జరిగిందేంది ? తను ఎద్దుల్నట్టా గాటిపాట్న కట్టేసి, రోంత మేత ముందరేసి నీళ్లు తాగి వచ్చేతలికి ఎఱ్ఱన్న మల్లా ఎఱ్ఱికోపంతో బోడ్డాన్ని కొట్టడానికి లగుసు కొన్నాడు[6]. అది పాపం గాటిపాట్న ఆ వల్లకు యీ వల్లకు ఎగిరిపడ్తా, జార్తా, ఉచ్చపోసుకుంటా ..... "ఎట్ట కొడ్తా వుండాడో సూసినావా వోబన్నా!" అన్నెట్టు సూస్తా వుండాది. తనడ్డం పోయి "ఆయాన తగిల్తే సచ్చిపోతాది" అంటే, "సచ్చిపోతే దీన్నాయినట్టాటి దాన్ని తెచ్చుకుంటాగానీ, నువు పక్కకు లే" అని అర్సె. ఎఱ్ఱన్న పెండ్లాం సూరమ్మ వొచ్చి "యింగ సాల్తీ .... యింగ సాల్తీ" అని మొగుని రెట్ట[7] బట్టి గుంజుతానే, వోబన్న దిక్కు వోరగా జూస్తా "ఎద్దుబోతే యింగోటయితాది, సేద్యెగాడు బోతే యింగోడయితాడు, మనిషి బోతే" అని దీర్గిచ్చె. మనిషి అంటే ఆమె మొగుడే !

బోడ్డి పొడ్సినందుకు ఆయప్పకు దెబ్బలేం తగల్లా. అయితే దెబ్బ లోపల్తగిలింది. తనెద్దు సేద్యెగాన్నేమనకుండా తనను పొడ్సడం ఆయప్పకు అవుమానంగా వుంది. ల్యాకపోతే దాన్ని అంత కసిగా కొట్టడు. సూరమ్మగ్గూడా అట్టనే వుందేమో ! ల్యాకపోతే "సేద్యెగాడు బోతే యింగోడయితాడు" అని యెందుకంటాది ? ముందుగా వాళ్ళు యెందుకంత కోపగిచ్చుకునిందీ వోబన్నకు తెలల్లా. ఆలోసన సేయగా సేయగా అర్తమయితాంది. యిన్నాళ్ళూ సేలు తనయే, ఎద్దులు తనయే అనుకొంటా సేసినాడు. "రేయ్, సేలు నీయి కాదు, ఎద్దులు నీయి కాదొరేయ్" అని యిప్పుడు యిద్దరూ సెప్పి, ఎచ్చరిచ్చినారు.

సేలుండాయి గనక వాళ్ళకు ఎద్దులు గావాల, సేద్యెగాడూ కావాల. అయితేనేం ? "ఎద్దుబోతే యింగోటొస్తాది, సేద్యెగాడు బోతే యింగోడొస్తాడు" తనకు ఎద్దు తెల్చు, దాన్తో పన్జేయడం తెల్చు, యీసేలో యీరముట్టు యెంత తెగాల్నో తెల్చు. ఎఱ్ఱన్నకు సేద్యెం తెల్దు, యీసేలో యీ వల్ల యెట్టుంటాదో తెల్దు. అయినా సరే ..... "సేద్యెగాడు బోతే యింగోడయితాడు, ఎద్దుబోతే యింగోటి!"

ఎఱ్ఱన్నకు ఏం తెలకపాయినా సేనుండాది. అదుంటే, ఎద్దుంటాది, ఎద్దెనకాల ఎద్దాల పోయే సేద్యెగాడూ వుంటాడు. అది ల్యాకపోతే ఎద్దూ ఒకటే, సేద్యెకాడూ ఒకటే. అందుకే వాళ్ళు అట్టనింది.

---

4) గట్టిగా ఢీకొనె 5) విరుచుకొని వెల్లికిలా 6) ఆరంభించాడు 7) చేయి